
ఎక్లాస్‌పూర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో వాగ్వాదానికి దిగుతున్న బీఆర్ఎస్ నాయకులు


మంథని మండలం వెంకటాపూర్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన మహిళలు


మంథనిలోని జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

# ప్రశాంతంగా అసెంబ్లీ పోలింగ్


మంథని మండలం వెంకటాపూర్‌లో బీఆర్ఎస్ నాయకు సంబురాలు


మంథని రూరల్ : మంథని మండలం గాజులపల్లిలో బారులు తీరిన ఓటర్లు

- **మంథని నియోజకవర్గంలో..... శాతం పోలింగ్ నమోదు**
- **పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్న పార్టీల శ్రేణులు..**
- **గెలుపు ధీమాలో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్**

మంథని, నవంబర్ 30: పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో విస్తరించి ఉన్న మంథని నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మంథని నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పల్మెల, పాలకుర్తి మండలా ల్లో మొత్తం 2,36, 442 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల అధికారులు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మొత్తం 288 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంథని నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం నుంచే ఓటర్లు భారీగా తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నక్సల్స్ ప్రాబల్య ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో పోలింగ్ సమయానికి 4 గంటల వరకే ఉండగా భారీ సంఖ్యలో ఓటర్లు క్యూలైన్‌లో ఉండటంతో సమయం దాటినప్పటికీ పోలింగ్ కేంద్రం ఆవరణలో క్యూలైన్‌లో ఉన్న వారందరికీ ఓటు వేసుకునేందుకు అధికారులు అనుమతి కల్పించారు. దీంతో మంథని నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ దాదాపు రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. ముత్తారం మండలం సీతంపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ మొరాయించింది. పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై 30 ఓట్లు వేసిన తరువాత ఈవీఎం బటన్ పని చేయలేదు. కొద్ది సేపు సెంటర్‌లోని ఓటర్లు ఇబ్బందులు పడ్డప్పటికీ అధికారులు దానిని సెట్ చేయడంతో యధావిధిగా ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఈవీఎం మిషన్ మొరాయించడంతో అధికారులు వేరే ఈవీఎం మిషన్ ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గలాట వాతావరణం చోటు చేసుకున్నటికీ ఎలాంటి ఘర్షణలు జరగలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టగా పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసింది. మావోయిస్టు ప్రాబల్యమైన మహారాష్ట్ర, ఛత్తీసడ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న మంథని నియోజకవర్గంలోని మహదేవపూర్, మహాముత్తారం, పల్మెల ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అధికార యంత్రాంగం, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. రాజకీయ పార్టీ శ్రేణుల మధ్య చోటు చేసుకున్న చిదురుమెదురు సంఘటనలు మినహా అంతర్రాష్ట్రాల సరిహద్దుతో పాటు నక్సల్స్ ప్రభావిత, మారుమూల ప్రాంతంగా ఉన్న మంథనిలో ఎన్నికల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది.

**రాత్రి 8.30 గంటల వరకు పోలింగ్**

మంథని నియోజకవర్గంలో సాయంత్రం ఐదు గంటల వరకు 74.12 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ అనం తరం పంపిణీ కేంద్రానికి వచ్చిన ఈవీఎం, వీవీప్యాట్లను సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ హెచ్ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు పోలీస్ బందోబస్తు మధ్య రాత్రి తరలించారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ముగియాల్సి ఉండగా, నిర్ణీత సమయంలోగా కేంద్రాల్లో ఉన్న వారు ఓటు వేసే పోలింగ్ కొనసాగించారు. రాత్రి 8.30 గంటల వరకు పోలింగ్ సాగింది.

**గెలుపు ధీమాలో పుట్ట మధూకర్..**

పోలింగ్ సరళిపై .బీఆర్ఎస్ అభ్యర్థి పుట మధూకర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా పుట్ట మధూకర్ నియో జకవర్గ ప్రజలకు చేసిన సేవలు ఈ ఎన్నికల్లో బాగా కలిసి వచ్చాయని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకే ప్రజలంతా పట్టం కడుతున్నారని నియోజకవర్గంలోని పలు మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు బాణ సంచా పేలుస్తూ ముందస్తు సంబురాలు నిర్వహించుకున్నారు. నియోజకవర్గంలో 288 పోలింగ్ కేంద్రాల వారిగా జరిగిన ఓటింగ్‌ను ఆయా పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు సైతం తమ నాయకులతో సైతం లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్ ఆనంతరం రాత్రి తమ నివాసాల్లో తమ అనుచరవర్గంతో కలిసి పోలింగ్ స్టేషన్ల వారిగా ఓట్ల జమలు, తీసివేతలతో తల ముకలయ్యారు.

**ప్రశాంతంగా అసెంబ్లీ ఎన్నికలు**

రామగిరి నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రామగిరి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని బేగంపేట, నవాబ్ పేట, నాగెపల్లి, పన్నూర్, రత్నాపూర్, సెంటినరీ కాలనీ, కల్వచర్ల, లోంకకేసారం, లద్నాపూర్, రాజాపూర్, బుధవారంపేట, ఆదివారంపేట, గ్రామాల్లో నిర్ణీత సమయానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుననారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి తమ ఓటు హక్కు వియోగించుకున్నారు. 144 సెక్షన్ అమలు చేస్తూ ఎలాంటి అంవాఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌లు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ

ప్రశాతం వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించుకున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. మంథని ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు గుంజపడుగు గ్రామంలోని పోలింగ్ కేంద్రంతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు చేపట్టిన బందోబస్తు వంటి ఆంశాలపై పోలీస్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రామగుండం పోలీ స్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రా ల్లో పట్టిష్ట భద్రత చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్య లు చేపట్టామన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన మంథనిలో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ప్రక్రియ జరిగిందని, సమస్యాత్మక అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సైతం పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. మం థని నియోజకవర్గంలో ఎలాంటి అల్లరు, గొడవ లు లేకుండా ప్రజలు శాంతియుత వాతావరణం లో ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. సీఐ సతీశ్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.


మంథని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో క్యూలైన్‌లో బారులు తీరిన ఓటర్లు


ముత్తారం : మచ్చుపేటలో పోల్ చిట్టీలు, గుర్తింపు కార్డులు చూపుతున్న ఓటర్లు


ముత్తారం: మైదంబండలో ఓటర్లతో మాట్లాడుతున్న పెద్దపల్లి డీసీపీచేతన


ముత్తారం : ఓడేడ్‌లో ఓట్ల కోసం బారులుతీరిన ఓటర్లు